క్లుప్తంగా

ఆర్జేడీపై దాడి దురదృష్టకరం

కళ్యాణదుర్గం/ఉరవకొండ: పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై ఇటీవల అనంతపురంలో జరిగిన దాడి దురదృష్టకరమని కళ్యాణదుర్గం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం కమిటీ సభ్యులు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ పీయూఎస్ఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు రాము, నరసింహాచారి, దొణతిమ్మప్ప, దినేష్ ఫాదర్, షఫీవుల్లా, శివసాయి డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి సంఘటనను ఖండిస్తున్నట్లు ఉరవకొండ నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రఘురాములు, సభ్యులు సాయికిరణ్, పామిడి సలీం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

కూడేరు: పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని, వీధుల్లో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి దుర్వాసన లేకుండా చూడాలని ఎంపీపీ నారాయణరెడ్డి పంచాయతీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని పి.నారాయణపురంలోని వీధుల్లో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నేతలు మంజునాథ్ రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆయుర్వేద వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరంతో పాటు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉరవకొండ ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థినిలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్మాసిస్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేపట్టండి

కూడేరు: మిషన్ అంత్యోదయ సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ అంత్యోదయ సర్వేపై ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



డిగ్రీ కళాశాలలో ఓటు అభ్యర్థిస్తున్న వెన్నపూస సంజీవరెడ్డి

రాయదుర్గం: ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస సంజీవరెడ్డి విజ్ఞప్తిచేశారు. రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేసి ఓటును అభ్యర్థించారు. దేశాయి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి

శెట్టూరు: తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి సాధ్యమని ఏఓ సంధ్యాకుమారి సూచించారు. శుక్రవారం మండలంలోని కైరేవు గ్రామంలో వేరుశనగ పొలాలను పరిశీలించి, రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ముచ్చుకుళ్లు తెగులు అధికంగా ఉందని, నివారణకు ట్రైకోడెర్మావిరిడీని పశువుల పేడలో కలిపి ఉపయోగించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు. వీఏఏ శ్రీలత, రైతులు హనుమంతురాయుడు, శ్రీరాములు, ఈరన్న, కరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

శివ పార్వతులకు పూజలు

కళ్యాణదుర్గం: మండలంలోని యర్రంపల్లి గ్రామంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శివపార్వతులు, నందీశ్వర, వినాయక విగ్రహాల ప్రతిష్ట శనివారం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంలో ఆలయానికి తీసుకొచ్చారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

కూడేరు: మండల కేంద్రంలో ఉన్న రవికృప పెట్రోల్ బంక్‌ను శుక్రవారం పౌర సరఫరాల శాఖ మండల అధికారి(సీఎస్‌డీటీ) లక్ష్మీదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. నిబంధనల మేరకు వినియోగదారులకు వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. వీఆర్వో సేతు మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే భూసంరక్షణ

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయం ద్వారానే భూసంరక్షణ, అధిక దిగుబడులు సాధించేందుకు ఆస్కారముందని డివిజన్ వ్యవసాయ సంచాలకుడు యల్లప్ప, ఆర్డీటీ ఎకాలజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని నిజవల్లి గ్రామంలో రైతులకు భూ అభివృద్ధి, పంటల పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మహేష్, ఆర్డీటీ టెక్నికల్ కోఆర్డినేటర్ బీరలింగప్ప, ఎంపీఈఓ పాతన్న పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..

- శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- జాగారణకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: మహా శివరాత్రి పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. మహాశివరాత్రి పర్వదినాన గరళ కంఠుడికి పూజలు చేస్తే అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. శనివారం జరిగే శివరాత్రి వేడుకలకు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. రాయదుర్గం పట్టణంలోని హటకేశ్వరస్వామి, మార్కండేయస్వామి, చన్నవీరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, బీటీపీ రోడ్డులోని బసవేశ్వరస్వామి, నేతాజీ రోడ్డులోని రామలింగేశ్వరస్వామి, కోటలో వెలసిన జంభుకేశ్వరస్వామి, రాజవిద్యాశ్రమం, శ్రీనగరేశ్వరస్వామి ఆలయం, ఓబుళాచారీ రోడ్డు నందు వెలసిన రేవణ సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో శివుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, జాగారణకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేడుకలకు ముస్తాబైన గవిసిద్దేశ్వరుడు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం సమీపాన కొండల మధ్య వెలసిన గవిసిద్దేశ్వరుడి ఆలయం శివరాత్రి వేడుకలు ముస్తాబైంది. ఆలయం చుట్టూ శోభిల్లే ప్రకృతి, కొండలు వాటి మధ్య కొలువుదీరిన ముక్కంటేశ్వరుడి దర్శనానికి భకులతో సినిమాహీరోలు, రాజకీయ నాయకులు తరలివస్తారు. ఈ కారణంగా బారీకేడ్ల ఏర్పాటుకు ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. శనివారం వేకువజాము నుంచే విశిష్ట పూజలు ప్రారంభించనున్న అర్చకులు రాత్రి జగారణకు సర్వం సిద్ధం చేశారు.

రాయదుర్గం రూరల్: మండల పరిధిలోని చదం గొల్లలదొడ్డి గ్రామ సమీపంలో ప్రశాంతమైన లింగాల బండ (కొండ) పై వెలిసిన పశుపతినాథుని ఆలయం దేశంలో మరెక్కడా లేదని జనశృతి. నేపాల్ తర్వాత మన దేశంలో ఇక్కడ మాత్రమే వెలిసిన లింగాన్ని పశుపతి నాథుడని, చతుర్ముఖేశ్వరుడని భక్తులు కొలుస్తారు. ఏకరాతి శిలతో శివలింగానికి నాలుగు వైపులా నంది విగ్రహాలుండడం ప్రత్యేకమైన విశిష్టత. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆలయం రంగురంగు



రాయదుర్గంటౌన్: విద్యుద్దీపాలంకరణలో జంబుకేశ్వరస్వామి ఆలయం



డీహీరేహాళ్: వేడుకలకు ముస్తాబైన గవిసిద్దేశ్వరాలయం

విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. అలాగే జుంజురాంపల్లి గ్రామ సమీపంలోని చిత్రబండపై వెలిసిన ఆరూఢ మల్లేశ్వరస్వామి ఆలయం కూడా ముస్తాబయింది. శనివారం రాత్రి జరిగే జాగారణ రోజున భక్తులు అశేషంగా తరలివచ్చి దైవదర్శనం చేసుకోవడం ఆనవాయితీ. ఇప్పటికే ఆయా ఆలయకమిటీలు కూడా భక్తుల దర్శనార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మరకతలింగ దర్శనం సర్వరోగ పాపహరణం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శ్రీరామేశ్వరాలయంలో ఉన్న మరకతలింగ దర్శనం సర్వరోగపాపహరణంగా వెలుగొందుతూ ఉంది. శనివారం మహా శివరాత్రి పర్వదిన మహోత్సవాలను నిర్వహించనున్నట్టు ఈఓ ఈశ్వర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 5.00 గంటలకు సుప్రభాత సేవ, 10.45 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, సాయంత్రం 4.00 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 10 గంటల నుంచి భజన బృందాలతో శివనామ సంకీర్తనలో భజన, అర్ధరాత్రి లింగోద్భవ రుద్రాభిషేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని దేవదాయశాఖ, రామేశ్వరస్వామి ఆలయ సేవాకమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మండలంలోని దుద్దేకుంట, శీర్పి, ఎర్రగుడి, బూదిగుమ్మ సిద్దేశ్వరాలయం, నక్కలపల్లి, తగ్గుపర్తి, జీడిపల్లి, గంగవరం తదితర గ్రామాల్లోని శివాలయాలు శనివారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.



బొమ్మనహాళ్: ముస్తాబైన రామేశ్వరాలయం



వజ్రకరూరు: గూళ్యపాళ్యంలోగురుదేవా ఆశ్రమం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రికి దేవదాయశాఖ అధికారులు, ఆలయ సేవా కమిటీ సభ్యులు శుక్రవారం ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులకు నీడ సౌకర్యార్థం ఆలయం ముందు భాగంలో షేమియానాలను ఏర్పాటు చేశారు. దర్శన సమయంలో భక్తుల మధ్య తోపులాట చోటు చేసుకోకుండా పోలీసులు ఆలయం లోపల క్యూలైన్లు ఏర్పాటు చేయించారు. శనివారం ఉదయం నుంచి జోడు లింగాలకు రుద్రాభిషేకం, క్షీరాభిషేకాలు సాయంత్రం యామ పూజలు, రాత్రి 1 గంటకు శివపార్వతులకు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. వజ్రకరూరులోని నగరేశ్వరస్వామి, భోగేశ్వర స్వామి, రామేశ్వర స్వామి ఆలయాలు, కొనకొండ్ల ఛాయామల్లేశ్వర స్వామి దేవాలయం, గోవిందప్ప ఆశ్రమం, గూళ్యపాళ్యం గ్రామంలోని గురుదేవా ఆశ్రమంలో వేడుకలు నిర్వహించనున్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కంబదూరు: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిచ్చారు. అలాగే సాయంత్రం గొఱవయ్యల ప్రదర్శన, నంది కోలాటం, నృత్య ప్రదర్శన నిర్వహించారు.

దేశంలోనే తొలి పాదరస శివలింగం



రాయదుర్గంటౌన్: శివ లింగాన్ని అందరూ చూసే ఉంటారు. అయితే పాదరసంతో తయారైన లింగాన్ని చూడాలంటే మాత్రం రాయదుర్గం పట్టణంలోని శ్రీరాజ విద్యాశ్రమానికి వెళ్లాల్సిందే. దేశంలోనే ప్రప్రథమంగా 1974లో అప్పటి ఆశ్రమ పీఠాధిపతి జీవన్ముక్తస్వాములు, జడసిద్దేశ్వర సరస్వతీ స్వాముల వారు రాయదుర్గంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం హరిద్వార్‌లో ప్రతిష్ఠించిన పాదరస విగ్రహం దేశంలో రెండోదని ఆశ్రమ ప్రస్తుత పీఠాధిపతి వాసుదేవానంద సరస్వతీ స్వామి 'సాక్షి'కి తెలిపారు. ఈ లింగం 14 సెంటీమీటర్ల ఎత్తు, 25 సెంటీమీటర్ల చుట్టుకొలత కలిగి ఉంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అదేరోజు లింగాన్ని తాకే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తారు.

నేటి నుంచి జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వజ్రకరూరు: జరుట్ల రామలింగేశ్వరస్వామి మూల విరాట్



వజ్రకరూరు: తట్రకల్లులోని వీరభద్రస్వామి మూలవిరాట్

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శివరాత్రి సందర్భంగా సోమవారం వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం ఆలయంలో పంచామృత అభిషేకం, కలశ స్థాపన, దేవతామూర్తులకు నూతన వస్త్రాల అలంకరణ, నవగ్రహారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రామాంజనేయులు, ఈఓ దేవదాసు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఆదివారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను శుక్రవారం ఈఓ, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు పర్యవేక్షించారు. దేవదాయశాఖ సిబ్బంది లాలేష్, లోకేష్, అర్చకులు మంజునాథస్వామి, నాగరాజుస్వామి, రాజేంద్రప్రసాద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు

వజ్రకరూరు మండలంలోని తట్రకల్లు గ్రామంలో భక్తుల కొంగు బంగారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం ఆలయంలో గణపతిపూజ, రక్షాబంధన, ఉమామహేశ్వర కలశస్థాపన, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రుద్రాభిషేకం, గంగపూజ, అన్నదానం ఉంటుందన్నారు. సోమవారం రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, అర్చకులు శుక్రవారం తెలిపారు.

రేపు రుద్రంపల్లి మల్లేశ్వరస్వామి రథోత్సవం

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లి మల్లీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం నూతన పార్వతీ పరమేశ్వరుల విగ్రహ సంప్రోక్షణ, హోమం, సాయంత్రం తీర్థ ప్రసాద వినియోగం, రాత్రికి అఖండ భజనా కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం హోమం, గంగపూజ, రథాంగహోమం సాయంత్రం 4గంటలకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు.సోమవారం గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమం,అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రేపటి నుంచి రంగనాథేశ్వరస్వామి ఉత్సవాలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎణ్ణె రంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత) ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు స్వామికి గంగను తీసుకొచ్చి ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి 7.15 గంటలకు పల్లకీ ఉత్సవం , సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు రథోత్సవం ఉంటుందన్నారు. అలాగే సోమవారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర స్థాయి రాతిదూలం లాడుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ. 8 వేలు దాతలు అందజేస్తారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బెళుగుప్ప: రాష్ట్రంలో అర్హుల గడపల వద్దకే పథకాలను అందిస్తూ.. సంక్షేమ పాలనతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూడాలన్నాదే ప్రభుత్వ లక్ష్యమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్, జేసీఎస్ మండల కన్వీనర్ తలారి రామాంజనేయులు అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోమారు వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. టీడీపీ పాలనలో రైతులను, డ్వాక్రా మహిళలను, విద్యార్థులను చంద్రబాబు మోసం చేసి నమ్మకద్రోహిగా మిగిలారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గాంధీ కలలకన్న గ్రామ స్వరాజ్యం, మహిళా సంక్షేమ పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపీపీ పెద్దన్న, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పుష్పావతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, మండల కన్వీనర్ శ్రీనివాసులు, యువజన విభాగం నాయకుడు త్రిలోక్‌రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, మారుతిరెడ్డి, కరుణాకర్, సర్పంచ్‌లు రత్నమ్మ, సాహితిరెడ్డి, రామకృష్ణమ్మ, రామిరెడ్డి, పురుషోత్తం, రమేష్, ఉమాపతి, రుద్రానంద, ఎంపీటీసీలు ప్రసాద్, వీరబొమ్మ పాల్గొన్నారు.


టీడీపీకి ప్రజాదరణ కరువు



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

టీడీపీకి గత మూడున్నర ఏళ్ల కాలంలో ప్రజాదరణ పూర్తిగా కరువైందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన పయ్యావుల కేశవ్ మూడున్నర సంవత్సరాల కాలంలో ఏ కార్యక్రమానికి కూడా జన స్పందన లేదన్నారు. టీడీపీ కేవలం నెగిటివ్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందన్నారు. కుల రాజకీయాలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందన్నారు. కులమతాలు, వర్గాలకతీతంగా నవరత్న పథకాలను అందిస్తూ జనాదరణ పొందుతున్న సీఎం జగన్‌ను రాష్ట్ర ప్రజలు 'మా నమ్మకం నువ్వే' అంటూ అండగా నిలుస్తున్నారన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రకు స్పందన కరువైందన్నారు. ప్రస్తుతం రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని, టీచర్ ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సభలో ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు.

రథోత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం



జరుట్ల రామలింగేశ్వరస్వామి రథోత్సవానికి ఎమ్మెల్సీని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠ స్థితి చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 1న నిర్వహించనున్న రథోత్సవానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని శుక్రవారం గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆహ్వానించారు. వజ్రకరూరు మండలంలోని ఎమ్మెల్సీ స్వగ్రామం కొనకొండ్లకు వెళ్లి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే వజ్రకరూరు మండలంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 18న నిర్వహించే కళ్యాణోత్సవం, రథోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్సీని ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు కుల్లాయిస్వామి

ఉరవకొండ: ఉరవకొండ టౌన్ బ్యాంకును మరింత అభివృద్ధి చేసి లాభాల బాటలో పయనించేలా చేసేందుకు పాలకవర్గ సభ్యులతో కలసి కృషి చేస్తానని బ్యాంకు అధ్యక్షుడు సాధు కుల్లాయిస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక టౌన్‌బ్యాంకు సమావేశ భవనంలో బ్యాంకు మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉపాధ్యక్షుడు చెంగల మహేశ్వరతో కలసి అధ్యక్షుడు మాట్లాడుతూ టౌన్ బ్యాంకులో నూతన సభ్యత్వం చేయించుకోవడానికి పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. ఒక్కో షేర్ విలువ రూ.300 గా నిర్ణయించి, ఒక్కో పాలకవర్గ సభ్యుడు ఐదు షేర్స్ తక్కువ కాకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సాధు వెంకటస్వామి, నాగరాజు, పెద్దకోట్ల శ్రీనివాసులు, మైనుద్దీన్, ఇంతియాజ్, గిద్దలూరు వెంకటేసులు, ప్రవీణ్‌కుమార్, పెద్దకోట్ల రమేష్, బ్యాంకు సీఈఓ కరణం వేదమూర్తి పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కంబదూరు: కంబదూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు విచారణ చేపట్టారు. మండలంలోని కురాకులపల్లి గ్రామానికి చెందిన హరిజన రామాంజనేయులపై గత నెల 29న బోయ మధు, బోయ ధను, హర్ష, బెస్త రంగా, బెస్త రాజగోపాల్, బెస్త గంగాధర్ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసుపై శుక్రవారం డీఎస్పీ బి.శ్రీనివాసులు కురాకులపల్లికి వెళ్లి విచారణ చేపట్టారు. బాధితుడు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షులతో డీఎస్పీ మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాజేష్ ఉన్నారు.

రూ.50 కోట్ల రుణాలివ్వడమే లక్ష్యం

కణేకల్లు: కణేకల్లు స్టేట్‌బ్యాంకు బ్రాంచ్‌లో రూ.50 కోట్ల మేరకు రుణాలివ్వడమే లక్ష్యమని మేనేజర్ భానుప్రతాప్ అన్నారు. కణేకల్లులో శుక్రవారం సాయంత్రం మహిళా సంఘాల సభ్యులు, ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందజేసే సున్నావడ్డీ రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంభన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రవికాంత్, రీజనల్ మేనేజర్ సంజీత్‌కుమార్, ఏపీఓ గోవిందప్ప, సీసీలు, ఆర్‌బీఓ సిబ్బంది, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై తూనికలు, కొలతల అధికారుల దాడి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పలు వ్యాపార దుకాణాలు, బేకరీలపై తూనికలు కొలతల అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ గుంతకల్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తన సిబ్బందితో కలసి దుకాణాల్లోని త్రాసులను పరిశీలించారు. సుమారు 38 దుకాణాలను పరిశీలించి ముద్ర వేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రెన్యూవల్ లేని ముద్రలు వేయని మూడు త్రాసులను స్వాధీనం చేసుకున్నారు. ఓ బేకరీలో రైల్వేస్‌లో అమ్మే బిసలరీ వాటర్ బాటిల్ ధరలకు అదనంగా ఐదు రూపాయలకు ఎక్కువ విక్రయిస్తున్నారని గుర్తించి నిర్వాహకులపై రూ.5,000 అపరాధ రుసుము విధించారు. తూకాల్లో ఎలాంటి మోసాలు జరిగినా వినియోగదారులు 9398136961 నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ గుంతకల్ డివిజన్ టీపీ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెస్ కోడ్ పాటించాలి

బెళుగుప్ప: సచివాలయ ఉద్యోగులు డ్రెస్ కోడ్ పాటించాలని డీఎల్‌డీఓ శంకర్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బెళుగుప్ప-1, -2 గ్రామ సచివాలయలను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ వ్యవస్థతో సేవలను విస్తృతం చేయాలని సూచించారు. రికార్డు నిర్వహణలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తపడాలన్నారు. ఈ సందర్భంగా డ్రెస్ కోడ్ పాటించని ఉద్యోగులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెస్ కోడ్ పాటించకపోతే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం మనోహర్, పీడీ సత్యానారాయణ అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పల్నాడు జిల్లా నర సరావుపేటలో రెండురోజుల క్రితం జరిగిన ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సైక్లింగ్ అండర్ 14 స్టేట్ మీట్(2022 – 23)లో కొనకొండ్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. మాస్ ట్రైల్ విభాగంలో మానస, టైమ్ ట్రైల్ విభాగంలో చైతన్య మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. అలాగే టైమ్ ట్రైల్ విభాగంలో అపూర్వ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారన్నారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ సైక్లింగ్ జట్టు తరపున విద్యార్థులు పాల్గొంటారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

శెట్టూరు: మండల కేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఐ యువరాజ్ తన సిబ్బందితో కలసి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కర్ణాటక ప్రాంతం పాతప్పగుడి నుంచి బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న నిందితులు ఓబులేశు, రామును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1,344 మద్యం టెట్రా ప్యాకెట్లను, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెస్తరపల్లి అడవికి నిప్పు

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి అటవీ ప్రాంతానికి పశువుల కాపర్లు శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టడంతో సుమారు 500 ఎకరాల్లో చెట్లు కాలిపోయాయి.జంబుగుంపల అటవీప్రాంతం రెండు రోజుల క్రితం 2,000 ఎకరాలు కాలిపోవడం తెలిసిందే. పక్షం రోజులుగా అడవులకు నిప్పు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా అగంతకులు ఏదో ఒక అటవీ ప్రాంతానికి నిప్పు పెడుతూ పచ్చదనాన్ని బుగ్గిపాలు చేస్తున్నారని బీట్ అధికారి పరమేశ్వరప్ప తెలిపారు. బెస్తరపల్లిలో శుక్రవారం ఉదయం దండోరా వేయించి అడవులకు నిప్పు పడకుండా పశువులు కాపర్లు స్థానికులను చైతన్య పరిచామన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో రక్తదానం

శెట్టూరు: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఏరియా ఫీల్డ్ కార్యాలయంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువత పాల్గొని రక్తదానం చేశారు. ఏటీఎల్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మంటలకు దెబ్బతిన్న సపోటా చెట్లు

కూడేరు: మండలంలోని గొటుకూరులో శుక్రవారం రోడ్డు వెంట వెళ్లే వ్యక్తులు బీడీ లేదా సిగరెట్ తాగి రోడ్డు పక్కన పడేయడంతో ఎండిన గడ్డికి నిప్పంటుకుని మంటలు లేచాయి. మంటలు ప్రశాంతి, కుమారి, ప్రవీణల సపోట పొలాలకు వ్యాపించాయి. స్థానికులు సమాచారమివ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేసింది. అప్పటికే పదుల సంఖ్యలో సపోట చెట్లు మంటలకు దెబ్బతిన్నాయి. అధికారులు ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.